
కథ

# లోకం మంది కాదు

ప్రభు



**కోరుకో ఏమి కావాలో... భోజనం కావాలా... భూములు కావాలా... ఏ ఆస్తులు కావాలి?**

**నాకు స్వేచ్ఛ కావాలి దేవా!**

**స్వేచ్ఛా? జీవితం సుఖంగా గడపగలిగే వరం కోరవా?**

**అడవి జంతువు వలె... క్రిమి కీటకాదుల వలె నేను తిండికోసం బతికే అల్పుడిని కాదు... సృష్టిలోని ప్రాణులలో సర్వోత్కృష్టుడనైన మనిషిని... నాకు కావలసింది స్వేచ్ఛ...**

**సరే... సరే... వాటితో పోలికెందుకు గానీ మొత్తం మీద ఈ పదిహేడవ శతాబ్దపు ఆలోచనల్ని ఇంకా వొదిలించుకోలేదన్న మాట... సరే నీ ముచ్చట నేనెందుకు కాదనాలి? అలాగే నీకు స్వేచ్ఛ ప్రసాదిస్తున్నాను...**

***

ఎంత ఎర్రటి సింధూరమంటే కన్నెత్తి చూస్తే చాలు వశీకరిస్తుంది.
అందులో లీనమైపోతాం.
సూర్యుణ్ణి చూసి పండనుకుని ఆంజనేయులు పైకెగిరాడంట...
సూర్యుణ్ణి చూసి పండని ఎలా అనుకుంటాడు?
సూర్యుడంటే పగలనుకునే నాగరికులకి ఆ ఊహ సోకదు.
ఇక్కడికొచ్చి చూడాలి...
నల్లటి చెట్ల వెనగ్గా ఆ కొండ మీద బుజ్జి సూర్యుడు ఎలా ఉన్నాడు?
మిగల ముగ్గిన జీడిమామిడి పండులా లేదూ...
పరిగెట్టుకెళ్లి కొండక్కేసి... కోసేసుకుని తినేద్దామనిపించదూ...
అంత ఎర్రటి సింధూరం.
వాగు పక్కన నున్నానున్నటి నల్లరాళ్లలో కుంకుడు చెట్టుకింద కొంచెం మనిషి ఆకారంలో ఉన్న చిన్న రాయి.
ఆ రాతికి రోజుల తరబడి పూసిన ఎర్రాఎర్రటి సింధూరం.
వాగుకి దేవుడైన ఆంజనేయుడు.

**సైకిలు కడ్డీ మీంచి కాలు తీసి దిగి దాన్ని మెల్లిగా దొల్లించి మొండి తాటిచెట్టుకి ఆన్చి నిలబెడతాడు. దానికి స్టాండు లేదు. తలపాగా తీసి ముఖం తుడుచుకుని ఆ తుమాలుని అలా భుజాన వేసుకుని ఆంజనేయులు ముందుకి వచ్చి చేతులు జోడించి ఉండిపోతాడు. రెండు మూడు నిముషాల తరువాత ఆంజనేయుడి పాదాల దగ్గరి సింధూరం తీసి బొట్టు పెట్టుకుని పక్కన ఉన్న మైలురాయి మీద కూర్చుంటాడు.**

మూడు వేపులా కొండల నడుమ ఎక్కడే కొండ మీంచో జాలు వారుతూ రాళ్ళ మీంచి ఘల్లుఘల్లున గెంతుకుంటూ ప్రవహించి కొండల నడుమ చాపరాయిని అరగదీసుకుంటూ కిందకి పరుగు దీసే వాగు.

ఎన్ని వేల సంవత్సరాలలో... ఎన్ని వేల జంతువులు... పక్షులు... చెట్లు... ఆ వాగు నీటిలో బతికాయో...

కొండ సిగ మీద సూర్యుడి ఉదయమైనా పున్నమి రాత్రి చంద్రుడి ఆగమనమైనా వాగుని మెరుపులు మెరిపిస్తాయి.

వాగుకి దేవుడైన ఆంజనేయుడు వాగుని కాపాడలేకపోయాడు.

రాళ్లని తవ్వేసిన పొక్లెయినర్ ఆంజనేయుడి మీద పడకుండా పిల్లలు కాపాడారు.

ఏ నీడా లేని వూరి మొదట్లో రోడ్డు పక్కన నరికేసిన తాటిచెట్టు మీద పెట్టారు ఆంజనేయుణ్ణి.

వాగు పోయింది.

కొండకీ కొండకీ మధ్య గోడలు లేపి అంత విశాల అరణ్యాన్నీ గొయ్యిలా చేసారు.

నీరు ప్రవహించింది.

చెట్లు... గుట్టలు... జంతువులు... పక్షులు... అన్నీ మునిగి పోయాయి.

పద్నాలుగు ఊళ్ళు నీళ్లలో పడి ఉబ్బిపోయాయి.

పదివేల మంది జనం తమ వూరి నించీ... పొలాల నించీ... పరిసరాల నించీ... స్వేచ్ఛ పొంది తెగిన రెక్కలతో రాజ్యం చుట్టూ దేవులాడుతున్నారు.

పిల్లలు మాత్రం సింధూరపు ఆంజనేయుణ్ణి వొదలరు.

రోజూ ఆ మొండి తాటి మొదలు మీద ఆంజనేయుడికి గన్నేరు



పూలమాల వేసి సింధూరం పూస్తారు.

అక్కడికి రోజూ మిట్టమధ్యాహ్నం వస్తాడు రామాంజి. పాతబడిన నల్లసైకిలు కారేజీ మీద నాలుగు అడుగుల ఎత్తున పేర్చిన కట్టె పుల్లలు... సైకిలు ట్యూబుతో వాటిని సైకిలుకి బిగించి కడతాడు. ముందు హాండిలుకి గోధుమ రంగులోకి మారిన మైకా సంచీలో సీవెండి కారేజీ.

మధ్యాహ్నం వస్తాడు రామాంజి సైకిలు వేసుకుని...

అతడు చూట్టానికి తాతయ్యలా ఉంటాడు. తలంతా తెల్లగా మెరిసిపోయింది. మీసం గడ్డం కూడా తెల్లగా అయిపోయాయి. నల్లటి అతని దేహం మీద పక్కటెముకలు స్పష్టంగా కనిపిస్తాయి. కళ్లు రెండూ రెండు గుంటల్లో ఉన్నట్టుగా ఉంటాయి. అవి ఎప్పుడూ నీళ్లు కమ్మినట్టుగా నిస్తేజంగా ఉంటాయి. అతన్ని చాలామంది... తాతా అనేస్తారు. అతని వయసువాళ్లు కూడా...

ఇంతా చేసి అతని వయసు నలభై అయిదే...

మిట్ట మధ్యాహ్నం నీడ కాళ్లకిందికి దూరిన సమయానికి మొండి తాటిచెట్టు ఆంజనేయులు దగ్గరకొస్తాడు రామాంజి.

సైకిలు మెల్లిగానే తొక్కుతాడు. కానీ అది ఆగదు. దానికి బ్రేకు లేదు. కాళ్లతో నేల మీద తన్ని పెట్టి ఆపుతాడు సైకిల్ని. సైకిలు కడ్డీ మీంచి కాలు తీసి దిగి దాన్ని మెల్లిగా దొల్లించి మొండి తాటిచెట్టుకి ఆన్చి నిలబెడతాడు. దానికి స్టాండు లేదు. తలపాగా తీసి ముఖం తుడుచుకుని ఆ తుమాలుని అలా భుజాన వేసుకుని ఆంజనేయులు ముందుకి వచ్చి చేతులు జోడించి ఉండిపోతాడు. రెండు మూడు నిముషాల తరువాత ఆంజనేయుడి పాదాల దగ్గరి సింధూరం తీసి బొట్టు పెట్టుకుని పక్కన ఉన్న మైలురాయి మీద కూర్చుంటాడు.

'ఈ లోకం మంది కాదు' అనుకుంటాడు.

సన్నటి గాలి పొలాల వాసన్ని తీసుకువచ్చి తాకుతుంది.

అలా చూస్తూ ఉండిపోతాడు.

నీరు కమ్మిన కనుగుడ్లలోంచి ఒక నీటిపొర కింది రెప్ప మీద పల్చటి గాజులా ఉబుకుతుంది.

లేచి మళ్ళీ ఆంజనేయులికి దణ్ణం పెట్టి సైకిలు తీస్తాడు.

***

'ఈ లోకం మంది కాదు' మనసులోనే అనుకుంటాడు.

పైకి మాటా పలుకూ ఉండదు.

సగం సగం కూలిపోయిన వెదురు పుల్లల కంచె లోపల చీకి పోయిన తాటాకుల ఇంటి అరుగు మీద కూర్చొంటాడు.

చేతిలో ఫొటో వంక తదేకంగా చూసుకుంటూ ఉంటాడు.

ఏపుగా పెరిగిన చెరుకుతోట.

పక్కన గట్టు మీద నవ్వుతూ రామాంజి.

అతని మెళ్ల మీద ఎగురుతున్నట్టు కూతురు.

అలా గంటలు గంటలు దాని వంక చూస్తాడు రామాంజి.

రిజర్వాయిర్ నీటి అడుగున జడమై పోయిన తన నేలని తల్చుకున్నకొద్దీ అతని కళ్ళూ ముఖమూ ఆరిపోతూంటాయి.

లోకం మంది కాకుండా పోయింది.

మనిషి ఆకారమూ రూపమూ పోయి ఆకుని కొరికి ఆకు మీదే చచ్చే పురుగులా మారిపోయాం.

తిండి తినబుద్ధి కాదు రామాంజికి. ముద్దలు ముద్దలుగా ఉన్న వరన్నంలో లచ్చించారు కలుపుకుని ఒక్కొక్క ముద్దా నమలకుండానే మింగుతాడు.

కూతురు తల నిమురుతూ ఫొటో వంక చూసుకుంటూనే ఉంటాడు.

మెల్లిగా తానే ఒక నీటిబొట్టుగా మారిపోయి ఘనీభవించిన గాజు ముద్దలాంటి నీటి అడుక్కి దిగుతాడు.

తన నేల... ఐదెకరాల నేల మీద చినుకులా రాలతాడు.

మొక్కలా మొలుస్తాడు.

పచ్చగా పెరుగుతాడు.

వాగు ఆంజనేయుడి తోకలా మెలికలు తిరుగుతూ కితకితలు పెడుతుంది.

సింధూరపు ఉదయాలు, సింధూరపు అస్తమయాలు పండులా దోసిట్లోకి వాలతాయి.

బిగుసుకుపోయిన గాజు ముద్దలో నీటిబొట్టు ఉక్కిరి బిక్కిరై భళ్ళున పగిలిపోతుంది. ఎండిపోయి రంగు మారిన సింధూరం రామాంజి కనుకొలకుల్లో కలికంలా మండుతుంది.

చేలో పచ్చని పంటలా పెరిగినవాళ్ళని ఆకు మీద పురుగులా మార్చేసారు. పాదుకొని పెరగడానికి నేల లేదు. చేయగల పని లేదు. మనుషుల్ని పురుగుల్ని చేసి వేటాడుతున్న ప్రపంచం ముందు వంతు వచ్చేవరకూ వేచి ఉండగల ఒకే ఒక్క స్వేచ్ఛ మిగిలింది.

వెదురుపుల్ల కంచె మీద ఎక్కడిదో ఒక పిచ్చుక వాలింది.

దాని మెడ మీద నల్లటి రంగు అళుకులా ఉంది.

'లోకం మంది కాదు' దాంతో అన్నాడు రామాంజి.

అది అతని వంక చూసి కిస్ కిస్ మని ఎగిరిపోయింది.

పిచ్చుకల కోసం కుచ్చుల్ని అల్లిన రోజులు గుర్తొచ్చాయి రామాంజికి.

అదంతా ఒక అల్లిక. పొగ ఒక ఉరితాడులూ కమ్ముకొచ్చి నేల మీంచి గెంటేసింది. ఈ పిచికల్లాగే ఎప్పుడో మనం కనబడకుండా పోతాం. ఫ్యాక్టరీలకీ... కాలవలకీ... ప్రాజెక్టులకీ... నగరాలకీ.... రెక్కల్ని అప్పజెప్పి వ్యాపారాగ్నిలో శలభాల్లా మాడిపోతాం.

తిండి తినబుద్ధి కాదు రామాంజికి. ముద్దలు ముద్దలుగా ఉన్న వరన్నంలో లచ్చించారు కలుపుకుని ఒక్కొక్క ముద్దా నమలకుండానే మింగుతాడు. కూతురు తల నిమురుతూ ఫొటో వంక చూసుకుంటూనే ఉంటాడు. మెల్లిగా తానే ఒక నీటిబొట్టుగా మారిపోయి ఘనీభవించిన గాజు ముద్దలాంటి నీటి అడుక్కి దిగుతాడు.

రామాంజికి కడుపులో దుఃఖం బయటికి రాదు.

అతని గడ్డం సన్నగా కంపిస్తుంది.

కంటి పక్కని ఒక నరం ఉబ్బుతుంది.

రామాంజి భార్య అమ్మాజీ వసారాలో కోళ్లకి ఉల్లిపాయ ముక్కలు కోస్తూ ఓ కంట రామాంజిని చూస్తూనే ఉంటుంది. అతడి దుఃఖపు లోతు తెలిసిన ఒకే ఒక మనిషి ఆమె. కానీ ఆమె కూడా దాని తడిని ఊహించలేదు. ఆ దుఃఖపు తడిలో అతడు అంటుకునిపోయి బయట పడలేక కొట్టుకోవడం ఆమెకి అంతుపట్టదు.

"అల్లాగా ఫుటో చూసుకుంటూ ఎన్నాల్లు కాలచ్ఛేపం చేసినా వొరిగేదేటుంటది... పెళ్లాన్నీ పిల్లనీ పెంచడానికి ఏటన్నా చెయ్యాలి కదా" అందామె.

ఉల్లిపాయ ముక్కల్ని గంప కింద పోసి గంపని సగం పైకెత్తింది. ఎక్కడో ఉన్న కోడి పిల్లలు అడుగులో అడుగేసుకుంటూ మెల్లిగా గంపకింద చేరాయి. తల్లికోడి మెడని గాలికి ఊగిన దీపంలా అటూ ఇటూ ఊపి మెల్లిగా గంప కిందికి దూరింది. అమ్మాజీ చటుక్కున గంప బోర్లించింది.



"నువ్వా కట్టెపుల్లల్ని అమ్మి కుటమానం ఎట్ట నెట్టుకొత్తావ్?... కాపు పుటక పుట్టి నేను కూలిపన్లకెళ్లాల్ని వత్తంది..."

రామాంజి ఆమె వంక చూసాడు.

"రోజులన్నీ మనయనుకుంటన్నావేమో... పెపంచికం మంది కాదు. ఎప్పుడో పాతికేళ్లనాటి భూమి పోయిందో... అని ఇంకా అదట్టుకునే యేలాడుతున్నావ్... ఇప్పుడు ఊళ్ళకూళ్ళే లేచిపోతన్నయంట తెల్సా" చేతులు తిప్పుకుంటూ చెప్పిందామె.

"ఏటైంది" అడిగాడు రామాంజి.

"ఏటైందో ఏటో మరి... ఈ సుట్టుపక్కలి ఊళ్లు... భూములూ... కొండలూ... గుట్టలూ... అన్నింటినీ గవుర్మెంటు లాగేత్తందంట... ఇదంతా ఫ్యాక్టరీలు కట్టేత్తరంట"

"మరి జనవేటైపోతారు"

"జనవేటైతే ఏవుడిక్కావాలా... మొన్నామద్దెన టుపాకులట్టుకొని ఎందర మంది జమాన్లు దిగినారో సూళ్ళేదా..."

రామాంజి మెదడులో శబ్దం భళ్ళుమని బద్దలైపోయింది.

అతనికి నోటంట మాట రాడంలేదు.

అసలు మనసులో ఏ మాటా పుట్టడమే లేదు.

"మనవెట్ట బతకాలో ఆ మొండి తాడిచెట్టు ఆంజనేలుకే తెలాల..." అంటూ అమ్మాజీ లోనికి వెళ్లిపోయింది.

పుడమి మీద పుట్టి యాభై ఏళ్లు నిండకుండానే లోకం మంది కాకుండా పోయింది.

ఎంతోమంది పిల్లలు పుట్టకుండానే ఆల్లకొక లోకమే లేకుండా పోతోందా...

మట్టి నేలమీద ఆదమరిచి నిదుర పోతున్న కూతురు తలని నిమురుకున్నాడు రామాంజి.

***

"మంది కాని యుద్ధంలోకి మన్నెవరో బలవంతాన తోసేసారు. వీరస్వర్గం తప్ప విజయం లేని యుద్ధంలో చేతులూ కాళ్ళూ కట్టి గంతలు కట్టి నోటిలో గుడ్డలు కుక్కి పడేసారు".

ఆంజనేయులు చెట్టుకాడ కూర్చుని సింధూరపు రాయిని చూస్తూ అనుకున్నాడు రామాంజి.

"ఏటి గట్టు దేవుడివి ఏటిని మింగేసాకా ఈ మొండి తాడిచెట్టు మీదికెక్కావు... యిదీ ఉండదంట... ఈ రోడ్రు పే...ద్దదై పోద్దట... చెట్లన్నీ నరికేత్తారంట... కొండలన్నీ పేల్చేత్తారంట... యాడికి పోతావ్ సామీ..."

చాలాకాలం తరువాత రామాంజి పెదాల మీద నవ్వు పుట్టింది.

లోకం నీదీ కాదు.. నాదీ... కాదు... మంది కాదు. దేవుడికే చోటు లేని లోకం... మనుషులకే చోటు లేని లోకం... లోకమింత కానిదెలా అయిపోయింది సామీ...

రామాంజి నవ్వు ముఖం ఆరిపోయింది.

అతడు మైలురాయి మీంచి లేచి మొండి తాటిచెట్టు ముందు బొక్కబోర్లా పడి

"సామీ నువ్వు అందర్నీ జయించి నోడివి... అన్ని కాలాల్నీ జయించి చిరంజీవివైనోడివి... నాకు జయించడం నేర్పు సామీ... అప్పుడు నేను నన్ను కాసుకుంటాను. నన్ను కాసుకున్నట్టే నిన్నూ కాసుకుంటాను... నాకు యుద్ధం చైడం నేర్పు సామీ..." అని మనసులో మొక్కుకున్నాడు.

•